క్లుప్తంగా

వైభవంగా వీరపెద్దన్న స్వామి ఉత్సవాలు



అలంకరణలో స్వామి చెక్క గుర్రాలు

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో శుక్రవారం వీరపెద్దన్న స్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి చెక్క గుర్రాలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులుపెద్దఎత్తున హాజరై స్వామిని దర్శించుకున్నారు.

ఈదురు గాలులతో వర్షం



యల్లనూరు రోడ్డులో నేలకొరిగిన చెట్టు

తాడిపత్రి అర్బన్: ఉక్కపోతతో అల్లాడుతున్న జనం శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షంతో సేదతీరారు. శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు చోట విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. కురిసింది చిన్నపాటి వర్షమే అయినా ఈదురు గాలులు కావడంతో యల్లనూరు రోడ్డులోని అనంత గ్రామీణ బ్యాంకు సమీపంలో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పుష్పావతి

గుంతకల్లు రూరల్: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత బారిన పడకుండా నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పుష్పావతి సూచించారు. శుక్రవారం మండలంలోని కొంగనపల్లిలో మాసికా మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా విటమిన్, ఐరన్ మాత్రలను వాడాలని, క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సూపర్ వైజర్ నాగేశ్వరి

తాడిపత్రి అర్బన్: వ్యక్తిగత పరిశుభ్రత పట్ల కిశోర బాలికలకు అవగాహన తప్పని సరి అని ఐసీడీఎస్ సీడీపీఓ షాజిదాబేగం అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కాలనీలో ఉన్న మూడో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు ఆహారం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, బ్లాక్ కో ఆర్డినేటర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ షాజిదాబేగం

గుత్తి: బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు సమతుల పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరి సూచించారు. పట్టణంలోని స్వీపర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలింతలు, కిశోర బాలికలు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రొటీన్, ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాల్గొన్నారు.

శుద్ధిచేసిన నీరు సరఫరా చేయండి

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యను సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు మారుతి, దాసరి శీనా, రమేష్ తదితరులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పైప్‌లైన్ల లీకేజీ కారణంగా పట్టణంలో అప్పుడప్పుడు కలుషితమైన నీరు సరఫరా అవుతోందన్నారు. పైప్‌లైన్లు మరమ్మతు చేయించాలన్నారు.

పండువలా సబ్సిడీ వేరుశనగ పంపిణీ

రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ పండువలా ప్రారంభమైంది. తొలిరోజు శుక్రవారం రైతుభరోసా కేంద్రాలు అన్నదాతలతో కిటకిటలాడాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వ్యవసాయాధికారులు వేరుశనగ పంపిణీ చేశారు. అధికారులు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న ప్రతి రైతుకూ రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు. సొంత గ్రామంలో వేరుశనగ పంపిణీ చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

- కిటకిటలాడిన ఆర్బీకేలు
- మొదటి రోజు వెల్లువెత్తిన రైతులు



గుంతకల్లు మండలం అయ్యవారుపల్లిలో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న దృశ్యం



పెద్దవడుగూరు : విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న ఏఓ మల్లీశ్వరి



గార్లదిన్నెలో వేరుశనగ పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

గుంతకల్లు రూరల్: మండల వ్యాప్తంగా ఉన్న 14 రైతు భరోసా కేంద్రాల్లోనూ శుక్రవారం విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. మండలంలో ఇప్పటివరకూ 2,102 మంది రైతులు విత్తన వేరుశెనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా మొదటి రోజు 1,448 మంది రైతులకు 1,107 క్వింటాళ్ల విత్తన వేరుశనగను పంపిణీ చేశామని వ్యవసాయాధికారుల తెలిపారు.

గుత్తి రూరల్/గుత్తి: విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం గుత్తిలోని ఆర్‌బీకేతోపాటు తొండపాడు రైతు భరోసా కేంద్రంలో గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు, వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్ ప్రారంభించారు. ఏడీఏ వెంకట్రాముడు గుత్తి మండలానికి 4,100 క్వింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం కేటాయించిందన్నారు. అందులో కే6, లేపాక్షి, 1694 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొదటి రోజు గుత్తి మండల వ్యాప్తంగా 13 రైతు భరోసా కేంద్రాల్లో 3,410 రైతులకు 3,015 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వీపీఏలు మానస, అజయ్, ఎంపీఈఓ షారోన్ పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల్లో ఏఓ డీ లీనా వసుంధర ఆధ్వర్యంలో శుక్రవారం రాయితీ వేరుశనగ పంపిణీ ప్రశాంతంగా జరిగింది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న 1,284 మంది రైతులకు 1126.50 క్వింటాళ్లు వేరుశనగ అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసులు, వీపీఏ వర్ష, రైతులు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలో 400 మంది రైతులు విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకున్నారని ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కొందరికి వేరుశనగ పంపిణీ చేశామని, శనివారం కూడా పంపణీ చేస్తామన్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలో 14 రైతు భరోసా కేంద్రాల్లో 936 మంది రైతులకు 794 క్వింటాళ్ల కే-6 రకం విత్తన వేరుశనగ పంపిణీ చేశామని ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కూడా విత్తన పంపిణీ చేస్తామన్నారు.

యాడికి: స్థానిక మార్కెట్‌లోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ వేరుశెనగ కాయలను పంపిణీ చేశారు. ఏడీఏ వెంకటరాముడు మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 600 మంది రైతులు 2,000 వేరుశనగ బస్తాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున పత్తి విత్తనాలు కొనుగోలు చేసే రైతులు బిల్లు భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా డీలర్లు బిల్లు ఇవ్వకుంటే ఏఓకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్‌బాషా, గ్రామ వ్యవసాయ అధికారులు రేష్మ, రమేష్, రైతులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామంలో వ్యవసాయాధికారి మల్లీశ్వరి వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం ప్రారంబించారు. ఈ సంరద్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 15 ఆర్బీకేల్లో 500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన వేరుశనగ పంపిణీ చేస్తాం: ఏడీ

గార్లదిన్నె: ప్రభుత్వం రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తుందని వ్యవసాయశాఖ ఏడీ అనంతపురము ఏడీ రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఏడీ మాట్లాడుతూ 40 శాతం సబ్సిడీతో రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్నామన్నారు. గార్లదిన్నెలో ఇప్పటి వరకు 972 మంది రైతులు 848 క్వింటాళ్ల కోసం నమోదు చేసుకున్నారన్నారు. బస్తా రూ.1710తో ఒక రైతుకు గరిష్ఠంగా మూడు బస్తాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



గుత్తి రూరల్: తొండపాడులో విత్తన పంపిణీ ప్రారంభిస్తున్న ఏడీఏ, ఏఓ



పామిడిలో రైతులకు విత్తన పంపిణీ చేస్తున్న ఏఓ లీనా వసుంధర



శింగనమల మండలం ఈస్ట్ నరసాపురంలో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న దృశ్యం



బుక్కరాయసముద్రం: వేరుశనగ విత్తనం పంపిణీ చేస్తున్న ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి



యాడికిలో రైతులకు వేరుశనగ అందజేస్తున్న ఏడీఏ వెంకటరాముడు

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలి

యాడికి: కౌంటింగ్ పూర్తయ్యే వరకు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని సీఐ నాగార్జున రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ఎన్నికల గురించి ఎక్కడా చర్చలు పెట్టవద్దని, దీనివల్ల గొడవలు జరుగుతాయన్నారు. గ్రూపులుగా ఒకచోట చేరి వాదోపవాదాలు పెట్టుకోవద్దని సూచించారు. అనుమానితులను బైండోవర్ చేస్తామన్నారు. బెట్టింగ్ వేసి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎక్కడైనా హింసాత్మక ఘటనలు జరుగుతుంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.



యాడికిలో మాట్లాడుతున్న సీఐ నాగార్జున రెడ్డి

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

గార్లదిన్నె: సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీధర్ హెచ్చరించారు.శుక్రవారం ఆయన గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. కౌంటింగ్ రోజు ప్రశాంతంగా ఉండాలని, గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో నిఘా ఉంచామన్నారు.అనవసరంగా ఎవరూ ఘర్షణలు పడొద్దన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దు

యల్లనూరు: శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. శుక్రవారం బుక్కాపురం గ్రామంలో సీఐ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌటింగ్ పూర్తయ్యే వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఏవైనా సమస్యలు సృష్టిస్తే జైలుకు పంపుతామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ గిరిబాబు, సిబ్బంది ఉన్నారు.

బాణసంచా విక్రయిస్తే దుకాణం సీజ్

యాడికి: ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకూ బాణసంచా విక్రయిస్తే దుకాణాన్ని సీజ్ చేస్తామని యాడికి అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగార్జున రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టపాకాయల లైసెన్స్ కలిగిన యజమానులతో సీఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలిచ్చారు. అనంతరం మండలంలోని లైసెన్స్ ఉన్న యజమానుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

టపాసులు కాల్చి అల్లర్లు సృష్టించవద్దు.

పెద్దవడుగూరు: రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కోడ్ ముగిసేంత వరకూ టపాసులు కాల్చినా, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని యాడికి రూరల్ సర్కిల్ సీఐ రోషన్, ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మేడిమాకుపల్లి, తెలికి గ్రామాల్లో వారు ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవ్వరూ గొడవలకు పాల్పడవద్దని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎన్నికల కోడ్ ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలల్లో ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో కలిసిమెలసి జీవించాలని ఆయన సూచించారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవహారాలను పార్టీకి ఆపాదించొద్దు

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన పట్నం నగేష్ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి చేశారని చెప్పుకోవడం మంచిదికాదని, ఈవ్యవహారాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదించవద్దని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి లలిత కళ్యాణి హితవు పలికారు. శుక్రవారం శింగనమలలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ నారాయణతో కలసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. కొంత మంది వైఎస్సార్‌సీపీ నాయకులు వారి గ్రామాల్లో పనులు చేశారని, వారికి జీఎస్టీ లేకపోవడంతో, వైఎస్సార్‌సీపీలో పట్నం నగేష్ ఉన్నప్పుడు, అతని పేరు మీద బిల్లులు చేయించారన్నారు. వాటికి సంబంధించిన బిల్లులు అడుగుతునే ఉన్నారన్నారు. రోజూ దాటవేస్తున్నారన్నారు. చివరకు తన ఇంటి వద్దకు రావాలని వైఎస్సార్‌సీపీ నాయకులను పిలిచి, డబ్బులు కట్టలేక తనపై దాడి చేశారని ఆరోపణలు చేశారన్నారు. కొంతమంది కులపెద్దలు కూడా గుర్తించాలని, వైఎస్సార్‌సీపీ మీద నిందలు వేయడాన్ని ఆలోచించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీలో బీసీలకు పెద్ద పీట వేశారని, చిన్న వయస్సు వాడైన పట్నం నగేష్‌కు మండల కన్వీనర్‌గా అవకాశం ఇచ్చారన్నారు. వ్యక్తిగత వ్యవహారాలతో పార్టీని వీడారన్నారు. నీ ఆర్థిక విషయాలను వైఎస్సార్‌సీపీకి ఆపాదించవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ, నాయకులు ఆదినారాయణ, శరత్, వీరనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి లలిత కళ్యాణి

బెట్టింగ్ జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దు

గుంతకల్లుటౌన్: రాజకీయ నాయకులపై ఉన్న అభిమానం, జ్యోతిష్యుల మాటలను నమ్మి సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు కట్టి జీవితాల్ని నాశనం చేసుకోవద్దని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, భారత రాజ్యాంగ అవగాహన వేదిక జిల్లా అధ్యక్షురాలు సరస్వతి సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈవీఎంలల్లో నిక్షిప్తమైన ప్రజాతీర్పును ఏ జ్యోతిష్యులు కూడా మార్చలేరన్న విషయాన్ని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రజాసంఘాల నాయకులు ఆలంనవాజ్, వేణుగోపాల్, ఓ.రామాంజనేయులు, బిందు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ



చలివేంద్రానికి వాటర్ కూలర్‌ను వితరణ చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని మెయిన్ బజార్‌లో కన్నెమూల విద్యావినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి శుక్రవారం దాతలు వాటర్ కూలర్ వితరణ చేశారు. వాటర్ కూలర్‌ను దాతల చేతులమీదుగా ప్రారంభించారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి

గార్లదిన్నె: ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని రైతు సంఘం నా యకులు కోరారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల పంటలు నష్టపోయాయన్నారు.అలాగే కరువు పరిస్థితు లను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించి జిల్లాలోని 29 మండలాలను కరువు మండ లాలుగా ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశగన పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రత్యామ్నాయ విత్తనాలు కందులు, పెసలు, అలసందలు, ఆముదం, జొన్నలు, సద్దలు, కొర్ర విత్తనాలు ఉచితంగా ఇవ్వాలన్నారు.అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రంను ఏడీ రవికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి నల్లప్ప, సీపీఎం మండల కార్యదర్శి చెన్నా రెడ్డి నాగార్జున రెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి

పెద్దవడుగూరు: రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ అందించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఆదినారాయణ కోరారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు ఆర్బీకేలో రైతులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వేరుశనగను వారు పరిశీలించారు. అల్లాబకాష్, శేషగోపాల్, ఓబులయ్య, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుత్తి: స్థానిక రైల్వేస్టేషన్‌లోని యార్డులో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ నాగన్న తెలిపారు. సంఘటన స్థలాన్ని జీఆర్‌పీ పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగ ప్రమాద ఘటనపై జీఆర్‌పీ ఎస్‌ఐ నాగన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భక్తవత్సలుడు చెన్నకేశవుడు



చెన్నకేశవస్వామి మూలవిరాట్

-27, 28న బ్రహ్మోత్సవాలు

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెత గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. ఏటా వైశాఖ మాసంలో స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. 27న స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు, 28న చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన కమిటీ సభ్యులు తెలిపారు. స్వామిని దర్శించుకోవడానికి మైసూరు నుంచి భక్తులు తరలిరావడం విశేషం. ఎన్నికల సందర్భంగా తాడిపత్రిలో జరిగిన అల్లర్ల దృష్ట్యా ఎక్కువ ఆర్భాటం లేకుండా ఆనవాయితీగా కార్యక్రమం జరుపుకోవాలని పోలీసులు ఆంక్షలు విధించారు.

ఆలయ చరిత్ర

పూర్వం శ్రీకృష్ణ దేవరాయల పరిపాలనలో జనమేజయుడు ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించినట్లు ఇక్కడ శిలాశాసనాలు చెబుతున్నాయి. ఒకప్పుడు కుమ్మెతాపుర పట్టణంగా పిలువబడే ఈ గ్రామంలో 101 శివలింగాలు ఉండేవని, కాలగర్భంలో కొన్ని కలిసిపోయాయని ప్రస్తుతం మూడు శివలింగాలున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గుప్తనిధుల కోసం కొందరు దుండగులు గతంలో పలుమార్లు ఆలయ సమీపంలో తవ్వకాలు చేపట్టారు. దీంతె పురావస్తుశాఖ అధికారులు, దేవదాయశాఖ సిబ్బంది ఈ ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదని ఆలయ ఆవరణలో బోర్డులను ఏర్పాటు చేశారు.



చెన్నకేశవస్వామి ఆలయం